06ATP27_06ATP27.qxd 13-02-2025 PM 10:40 Page 1



## విద్యుత్ సబ్ స్టేషన్‌కు ముల్లకంపలు వేసి కార్యాలయానికి తాళం వేసి రైతుల నిరసన

- రోజుకు అరగంట కరెంటు ఇస్తే పంటల పరిస్థితి ఏంటి..

అగళి, ఫిబ్రవరి 13 ప్రభాతవార్త



ముళ్లకంపలు వేసి ధర్నా చేస్తున్న చేస్తున్న రైతులు



సబ్ స్టేషన్ ముందు నిరసన వ్యక్తం చేస్తున్న రైతులు

అగళి విద్యుత్ సబ్‌స్టేషన్‌కు తాళం వేయడం తోపాటు, ఆఫీసుకు తాళం వేసి పెద్ద ఎత్తున రైతులు ధర్నా, నిరసనను వ్యక్తం చేశారు. అగళి, ఎంఎంపాళ్యం, ఆర్‌జి హళ్లి, బొమ్మాసన పల్లి, హనుమనపల్లి తదితర గ్రామాల నుంచి రైతులు అగళి సబ్‌స్టేషన్ కు చేరుకుని లో ఓల్టేజీని తీర్చాల ని, నాణ్యమైన కరెంటును ఇవ్వా లని విద్యుత్ కార్యాలయానికి తాళం వేసి ముళ్లకంపలు వేసి నిరసన వ్యక్తం చేశారు. 9 గంటలు వ్యవసాయానికి విద్యుత్ ఇవ్వాల్సి ఉండగా అరగంట ఇస్తే పంటలు రక్షించుకునేది ఎలా అని రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. లో ఓల్టేజీ వల్ల బోరులోని నీరు బయటికి రాక పంటలు ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. తరచూ విద్యుత్‌లైన్ కాలిపోవడం, జంపర్ కట్ అవడం, కేబుల్ కాలిపోవడం, మోటార్లు కాలడం, స్టార్టర్లు కాలడంతో నష్టపోతున్నామని రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. 400 యామ్స్ కరెంటు ఇవ్వాల్సి ఉండగా 150 యామ్స్ ఇస్తే మోటార్లు రన్ అవుతాయా అని ప్రశ్నించారు. అరగంట కరెంటు ఏ మూలన సరిపోతుందని ప్రశ్నించారు. సింగిల్ క రెంటు కూడా ఇవ్వని పరిస్థితి ఏర్పడిందని, సాయంత్రం 6గంటలకు కరెంట్ తీస్తే ఉదయం 10గంటలకే మళ్లీ మినుకుమినుకు మంటుందని రైతులు తెలిపారు. విద్యుత్ కార్యాలయంలో సక్రమంగా సమాచారం ఇవ్వడం లేదని లైన్‌మెన్‌లు పనితీరు అధ్వానంగా ఉందని ఆర్‌జి హళ్లి లైన్‌మెన్ సక్రమంగా సమాచారం ఇవ్వరని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏఈని అడిగితే ఏడిని అడగండని, ఏడిని అడిగితే డిఈని అడగండని అంటున్నారే తప్పా కరెంటు ఇవ్వడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. 1970 సంవత్సరంలో వేసిన వైర్లే ఉన్నాయని వాటిని మార్చాలని రైతులు డిమాండ్ చేశారు. నాణ్యమైన విద్యుత్‌ను లో ఓల్టేజీ లేకుండా అందించాలని నిరసన వ్యక్తం చేశారు. చివరకు ఉన్న కరెంటులోనే సర్ది బోర్లకు కరెంటు ఇవ్వడంతో రైతన్నలు శాంతించారు.

## ఇండెంట్ ఉంటేనే ఇసుక

- అవసరం లేని వారు ఇసుకను తీసుకెళ్తే చర్యలు

అగళి, ఫిబ్రవరి 13 ప్రభాతవార్త

అవసరం లేకున్నా ఎవరికి పడితే వారు సువర్ణముఖి నదిలో ఇసుకను తోలితే శాఖాపరంగా చర్యలు తప్పవని తహశీల్దారు సుబ్బారావు సచివాలయంలో ఉచిత ఇసుక లాగిన్‌లో ఇసుక అవసరమైన వారు దరఖాస్తు చేసుకుంటే ఇండెంట్ ఇస్తారని, ఇండెంట్ లేనిదే ఇసుకను ఇవ్వరని, అలా అనుమతి లేకుండా ఇసుకను తోలితే చర్యలు తప్పవని ఈ విషయాన్ని ఎస్‌ఐ వీరేష్‌తో కూడా సంప్రదింపులు జరిపినట్లు తహశీల్దారు సుబ్బారావు తెలిపారు. ఉచిత ఇసుక అవసరమైన వారు ఆధార్, రేషన్‌కార్డులతో సచివాలయానికి వెళ్లి డిజిటల్ అసిస్టెంట్లను కలవాలని, అక్కడ ఇండెంట్లు ఇస్తారని తెలిపారు. ఇంటి నిర్మాణానికో, బాత్‌రూమ్ నిర్మాణానికో అవసరం ఉన్నవారు ఇండెంట్ తీసుకుని రోజుకు నాలుగు ట్రాక్టర్లు తీసుకోవచ్చన్నారు. అవసరం లేనివారు ఎలాంటి అనుమతి లేకుండా సువర్ణముఖి నదిలో ఇసుకను తోడి ఇతర ప్రాంతాలకు పంపడం, కర్ణాటకకు తరలించడం చేస్తే కేసులు నమోదు చేస్తామని ప్రభుత్వం మంచి ఆశయంతో పేదల కోసం ఇసుక ఉచిత విధానాన్ని ప్రవేశ పెట్టిందని దీనిని సద్వినియోగం చేసుకోవాలని కొందరు స్వార్థపరుల వల్ల ఇసుకను ఇతర ప్రాంతాలకు తరలిస్తే తప్పక చర్యలు తీసుకుంటామన్నారు. సువర్ణముఖి నదిలో ఉచిత ఇసుకను కూడా ఎంతవరకు తవ్వాలో మైన్స్ అండ్ జియాలజీ శాఖ వారి ఆదేశాల మేరకు ఇసుకను తీసుకోవాలన్నారు. ఎక్కువ లోతుకు వ ఎళ్లి ఇసుకను తోలితే భూగర్భ జలాలు అడుగంటి బోర్లు, బావులు ఎండిపోయి, వక్క, కొబ్బరి, మల్బరి, దానిమ్మ, పండ్ల తోటలు ఎండిపోయే పరిస్థితి వస్తుందని, అది రాకుండా జాగ్రత్తగా అవసరమైన వారు ఇసుకను తీసుకెళ్లాలన్నారు. ఇండెంట్లు ఉంటేనే ఇసుక అని తహశీల్దారు తెలిపారు.

## శివరాత్రి పండుగకు హేమావతిలో ముందస్తు ఏర్పాట్లు

అమరాపురం ఫిబ్రవరి 13 ప్రభాతవార్త



జెసిపి ద్వారా రోడ్డు మరమ్మతు దృశ్యం

మండల పరిధిలో హేమావతి గ్రామంలో ఈనెల 28 నుంచి సిద్దేశ్వర స్వామి శివరాత్రి బ్రహ్మోత్సవాలు ప్రారంభమవుతున్న సందర్భంగా అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. మడకశిర ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు, మడకశిర తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామిల ఆదేశాల మేరకు హేమావతి గ్రామం నలువైపులా ఆర్ బి అధికారులు రోడ్డుకు ఇరువైపులా ఉన్న కంప చెట్లను తొలగిస్తూ గుంతలను పూడ్చడం మొదలుపెట్టారు. అదేవిధంగా పూర్తిస్థాయిలో బ్రహ్మోత్సవాల్లో సౌకర్యం కల్పించడానికి అధికారులు సమాయత్తమవుతున్నారు.

## ఘనంగా సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతి ఉత్సవాలు

గుత్తి, ఫిబ్రవరి 13 ప్రభాతవార్త



బంజారాల ఆరాధ్యదైవం సంత్ సేవాలాల్ మహారాజ్ 286వ జయంతి ఉత్సవాలు, అదేవిధంగా జగదాంబమాత 9వ వార్షికోత్సవ వేడుకలు గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. మండలంలోని సేవాఘడ్‌లో సేవాలాల్ మహారాజ్ జన్మించారని తన ధర్మ ప్రభోదాల కారణంగా సమైక్యతను, బంజారాల జాతిని సంరక్షించారని బంజారాల విశ్వాసం. ఆలయంలో సేవాలాల్ విగ్రహానికి, జగదాంబమాత విగ్రహానికి పంచామృతాభిషేకాలు, మహా మంగళహారతి, గణపతిపూజ, ఆదిత్య నవగ్రహ పూజలు, తదితర పూజలు గావించారు. ఈ ఉత్సవాలు మూడు రోజుల పాటు జరగనున్నాయి. ఉత్సవాల నిర్వహణకై ప్రభుత్వం 50 లక్షల రూపాయల నిధులను కేటాయించింది. జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్ ఆధ్వర్యంలో భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. గుత్తి, ఉరవకొండ, గుంతకల్లు డిపోల నుండి ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేశారు. పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యుఎస్, వైద్య ఆరోగ్యశాఖ, మున్సిపల్, గ్రామ పంచాయతీ, అగ్నిమాపక విభాగం, సమాచార పౌరసరఫరాలశాఖ సంబంధిత శాఖలు పెద్దఎత్తున తరలివచ్చే భక్తులకు విస్తృతంగా ఏర్పాట్లు చేశారు. గుంతకల్లు డిఎస్‌పి శ్రీనివాస్ ఆధ్వర్యంలో గుత్తి సిఐ వెంకటేశ్వర్లు ప్రత్యేక బందోబస్తు చర్యలు చేపట్టారు.

## శ్రీకెంచమాంబదేవి విశేషపూజల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్సీ



మాజీ ఎమ్మెల్సీకి సన్మానం దృశ్యం

అమరాపురం ఫిబ్రవరి 13ప్రభాతవార్త

మండల పరిధిలో గౌడనకుంట గ్రామంలో వెలసిన కుంచిటిగ సోమేనహళ్ళి జానకల్లు గోత్రానికి చెందిన ఆరాధ్య దైవం శ్రీ కెంచమాంబ దేవి పెద్ద జాత్ర ఉత్సవాలలో గురువారం మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి హాజరై అమ్మవారి విగ్రహానికి విశేష పూజలు నిర్వహించారు.అదేవిధంగా దేవాలయ యజమానులు ఆలయ కమిటీ సభ్యులు మాజీ ఎమ్మెల్సీకి మరియు విచ్చేసిన ప్రముఖులకు ఘనంగా సన్మానం చేశారు. ఈ సందర్భంగా కేంచమాంబ దేవి దేవస్థాన సేవా సమితి అధ్యక్షులు అమరాపురం లింగరాజు, ఉపాధ్యక్షులు మద్దనకుంట జె. మంజునాథ్, కార్యదర్శి తమ్మడేపల్లి ఈర సంయుక్త కార్యదర్శి గౌడనకుంట నారాయణరెడ్డి, ట్రెజరర్ గౌడనకుంట లింగన్న, మరియు దేవాలయ సభ్యులు ఈశ్వరప్ప, నింగణ్ణ, సిద్దప్ప, ఈరలింగప్ప, శివానందప్ప, దేవరాజు, అమరాపురంగోపినాథ్ ,అమరాపురం యంజారప్ప,అమరాపురం రఘు, ఈరలింగప్ప, మాజీ సర్పంచ్ విశ్వేశ్వర, తెలుగు రైతు కార్యదర్శి ఉగ్ర నరసింహ, చెరువు సంఘం అధ్యక్షుడు గురు సిద్ధప్ప,మండల టిడిపి ప్రధాన కార్యదర్శి జయరామప్ప ,వీరక్యాతరాయప్ప, మండల కన్వీనర్ గణేష్, మాజీ మండల కన్వీనర్ శివరుద్రప్ప, మాజీ ఎంపీపీ కృష్ణమూర్తి, రామిరెడ్డి, డీలర్ల సంఘం అధ్యక్షుడు బంగారుపాలెం తిప్పేస్వామి, నాగోనపల్లి మంజునాథ్ చెరువు ప్రెసిడెంట్ నరసింహమూర్తి ,మాజీ ఎంపిటిసి చంద్రప్ప, పట్టణ టిడిపి అధ్యక్షుడు నాగరాజు, నిరంజన్ ,దాదాపీర్, డీలర్ సంఘం ఉపాధ్యక్షుడు స్టూడియో హనుమంతు, చంద్రశేఖర్ గౌడ్ ,మల్లికార్జున ,నగేష్, దేవగానపల్లి మంజునాథ్ యాదవ్ ,క్లస్టర్ ఇంచార్జిలు కృష్ణమూర్తి, రవి ,ఎంపీటీసీ ఓంకార్ స్వామి, ప్రదీప్, రఘు, హనుమంతరాయతదితరులు పాల్గొన్నారు.

## మెగా జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోండి..!

ఎమ్మెల్యే రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి,

మడకశిర ఫిబ్రవరి 13 ప్రభాతవార్త



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి

మడకశిర పట్టణంలోని మధుగిరి రోడ్డు మారుతి నగర్ లో ఈనెల 15వ తేదీన శనివారం ఉదయం 10.00 గంటలకు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయము నందు నిర్వహించనున్న మెగా జాబ్ మేళాను మడకశిర నియోజకవర్గ నిరుద్యోగ యువతీ, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొని సద్వినియోగం చేసుకొని జీవితంలో స్థిరపడాలని మడకశిర శాసనసభ్యులు ఎంఎస్ రాజు మాజీ శాసనమండలి సభ్యులు గుండుమల తిప్పేస్వామి విలేకరుల సమావేశంలో తెలియజేశారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా 50కు పైగా కార్పొరేట్ కంపెనీల వారు మడకశిరకే వచ్చి నిరుద్యోగ విద్యావంతులను ఎంపిక చేసుకోనున్న నేపథ్యంలో ప్రజలందరూ నియోజకవర్గంలోని యువతి,యువకులకు తెలియజేసి సద్వినియోగం చేసుకునేలా చొరవ చూపాలని కోరడం జరిగింది.

## రోడ్డు సౌకర్యానికి 20 వేలు ఆర్థిక సాయం అందించిన తెదేపా నాయకులు దుర్గేష్

గుడిబండ ఫిబ్రవరి 13 ప్రభాతవార్త:



రోడ్డును పరిశీలిస్తున్న దుర్గేష్

మండల పరిధిలోని సింగేపల్లి గ్రామంలో ఆర్డిటి సంస్థ నిర్మిస్తున్న కల్వర్టుకు తెలుగుదేశం పార్టీ జిల్లా లింగాయత్ అధ్యక్షుడు దుర్గేష్ తన వంతు సాయంగా 20 వేలు రూపాయలను విరాళంగా అందించారు. సింగేపల్లి గ్రామానికి వెళ్లే ప్రధాన రహదారిలో వంక ను దాటుకొని వెళ్ళడానికి గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనేవారు.ఈ పరిస్థితిని గ్రామస్తులు ఆర్డిటి సంస్థ దృష్టికి తీసుకెళ్ళడంతో స్పందించిన ఆర్డిటి సంస్థ వారు 20 లక్షల రూపాయలు నిధులను కేటాయించి చెక్ డ్యాం నిర్మాణం చేపట్టి దానిపైన రోడ్డు నిర్మిస్తున్న సందర్భంగా జిల్లా తెదేపా లింగాయత్ అధ్యక్షుడు దుర్గేష్ 20వేల రూపాయలు రోడ్డు నిర్మాణానికి ఆర్థిక సహాయాన్ని అందజేశారు.ఈ క్రమంలో గ్రామస్తులు తెదేపా నాయకుడు దుర్గేష్ కు కృతజ్ఞతలు తెలిపారు.

## బిసి వసతి గృహంలో విద్యార్థి చంప పగలగొట్టిన వర్కర్

వర్కర్,వార్డెన్లు పై చర్యలు తీసుకోవాలంటున్న ప్రజలు

గుడిబండ ఫిబ్రవరి 13 ప్రభాతవార్త:



వర్కర్ చేయిచేసుకున్న విద్యార్థి

మండల పరిధిలోని మందలపల్లి గ్రామంలో ఉన్న బీసీ వెల్ఫేర్ హాస్టల్ లో విద్యార్థి చంప పగలగొట్టిన వర్కర్ ను వెంటనే విధుల నుండి తొలగించాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు. వసతి గృహంలో విద్యార్థులు మెనూ ప్రకారం కోడి గుడ్డు అడిగినందుకు విద్యార్థి మీద చేయిచేసుకుని రాయడానికి వీలుకాని దుర్భాషలాడుతున్నాడని విద్యార్థులు వాపోతున్నారు. వర్కర్ కు విద్యార్థులను కొట్టే హక్కు ఎవరిచ్చారంటూ ప్రజలు ప్రశ్నిస్తున్నారు.వార్డెన్ కూడా బిసి వసతి గృహానికి చుట్టపు చూపుగా వచ్చివెళుతున్నట్టు ఆరోపణలు ఉన్నాయి.గతంలో కూడా వార్డెన్ పై పలు ఆరోపణలు ఉన్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి వర్కర్ వార్డెన్లు పై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

## గడ్డివాములు దగ్ధం - రూ.లక్ష నష్టం

గుత్తి, ఫిబ్రవరి 13 ప్రభాతవార్త



గడ్డివాములు దగ్ధమవుతున్న దృశ్యం

మండలంలోని అనగానదొడ్డి గ్రామంలో ప్రమాదవశాత్తు నిప్పు అంటుకోవడంతో ముగ్గురు రైతులకు చెందిన గడ్డివాములు దగ్ధమయ్యాయి. దీంతో దాదాపు లక్ష రూపాయల వరకు ఆస్తి నష్టం సంభవించింది. వివరాలు ఇలా వున్నాయి. గ్రామానికి చెందిన పోతుల కృష్ణయ్య, పోతుల రామాంజనేయులు అనే ఇరువురు రైతుల గడ్డివాములు దగ్ధం కావడంతో 60 వేల రూపాయల ఆస్తి నష్టం సంభవించింది. అదేవిధంగా రంగడు అనే రైతుకు చెందిన గడ్డివాము దగ్ధం కావడంతో 40 వేల రూపాయల ఆస్తి నష్టం సంభవించింది. ఎవరో గుర్తుతెలియని వ్యక్తులు ఈ పనికి పాల్పడి వుండొచ్చని బాధితులు వాపోయారు. అందిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## కులగణనతోనే సామాజిక న్యాయం సాధ్యం

-సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గసభ్యులు జగదీష్



రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న సిపిఐ నాయకులు జగదీష్

గుంతకల్లు, ఫిబ్రవరి 13 ప్రభాతవార్త

కులగణనతోనే సామాజిక న్యాయం సాధ్యమని సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గసభ్యులు జగదీష్ అన్నారు. రాష్ట్రంలో వెంటనే కులగణన చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. పట్టణంలోని సిపిఐ కార్యాలయంలో గురువారం పలు కులసంఘాల నాయకులతో రౌండ్‌టేబుల్ సమావేశాన్ని ఆ పార్టీ పట్టణ అధ్యక్షులు గోపీనాథ్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన జగదీష్ మాట్లాడుతూ ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీలకు కులగణనతోనే న్యాయం జరుగుతుందన్నారు. నాయకులు స్పందించకపోతే ఈ విషయంపై పెద్దఎత్తున ఐక్య ఉద్యమం చేయాల్సిన ఆవశ్యకత ఏర్పడుతుందన్నారు. పక్క రాష్ట్రం తెలంగాణలో ఇటీవల కులగణన పూర్తి చేసి నివేదికను ప్రభుత్వానికి అందచేయడం జరిగిందని గుర్తు చేశారు. దీంతో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి జనాభా ప్రాతిపదికన బిసిలకు 47 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తామని అసెంబ్లీలో హామీ ఇవ్వడం జరిగిందన్నారు. కర్ణాటకలో కులాల సమాచారాన్ని సేకరించి వివరాలు ఆ ప్రభుత్వం బయటకు వెల్లడించలేదన్నారు. కులగణనతో రాజకీయ, సామాజికంగా వెనుకబడిన కులాలలకు ఎంతో ఉపయోగకరంగా వుంటుందని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఈ విషయంపై స్పందించి రాష్ట్రంలో వెంటనే కులగణన చేపట్టాలని ఆయన పేర్కొన్నారు. ఈ సమావేశంలో రజక సంఘం నాయకులు దేవేంద్రప్ప, బలిజ సంఘం నాయకులు పూల రమణ, కురుబ సంఘం నాయకులు సోమశేఖర్, ఎంఆర్‌పిఎస్ నాయకులు స్వామిదాస్, వాల్మీకి సంఘం నాయకులు సూర్యనారాయణ, మైనార్టీ నాయకులు ఫిరోజ్‌ఖలీల్, ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీ నాయకులు ఆలం నవాజ్, క్రిస్టియన్ సంఘం నాయకులు సాల్మన్‌రాజు, బిఎస్‌పి నాయకులు శ్రీనివాసులు, సంచారజాతుల రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వై.శ్రీనివాసులు, సిపిఐ పార్టీ నాయకులు వీరభద్రస్వామి, మహేష్, ఎస్‌ఎండి గౌస్, రాముబాయల్, దేవేంద్ర, ఈశ్వరయ్య, తదితరులు పాల్గొన్నారు.

## వృద్ధుడు ఆత్మహత్య

గుత్తి, ఫిబ్రవరి 13 ప్రభాతవార్త



ఆత్మహత్యకు పాల్పడిన దృశ్యం

మండలంలోని తొండపాడు గ్రామానికి చెందిన గొల్ల ప్రసాద్ (70) అనే వృద్ధుడు గురువారం విషపు గుళికలు సేవించి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మద్యానికి బానిసైన ఇతను జీవితంపై విరక్తి చెంది ఈ అఘాయి త్యానికి పాల్పడ్డాడు. చికిత్స నిమిత్తం అతన్ని ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధృవీకరించారు. ఈ సంఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## గడ్డివాములు వేస్తూ కళ్లుతిరిగి పడిపోయి రైతు మృతి

-విడపనకల్లు మండలం పాల్తూరులో హృదయవిదారక ఘటన

ఉరవకొండ, ఫిబ్రవరి 13 ప్రభాతవార్త



మృతి చెందిన బోయ శంకరప్ప



మృతదేహంవద్ద విలపిస్తున్న మృతుని సోదరి

పశువుల కోసం గడ్డివాములు వేస్తూ ఉన్నఫల ంగా కళ్లుతిరిగి కింద పడిపోయి వజ్రకరూరు మండలం పాత కడమల కుంట గ్రామా నికి చెందిన బోయ శంకరప్ప (33) అనే రైతు మృతి చెందిన ఘటన విడపన కల్లు మండలం పాల్తూరు గ్రామంలో గురువారం చోటు చేసుకుంది. మృతుని కుటుంబ సభ్యుల ద్వారా తెలిసిన మేరకు వివరాల్లోకి వెళితే...పాత కడమలకుంట గ్రామానికి చెందిన బోయ శంకరప్పకు గ్రామంలో 8 ఎకరాల భూమి ఉండగా వ్యవసాయం ద్వారా జీవనం సాగిస్తున్నారు. మూడు రోజుల క్రితం ఆయన తన సోదరి సుజాత మెట్టినిల్లైన పాల్తూరుకు వచ్చాడు. గురువారం మధ్యాన్నం 12 గంటల సమయంలో దొడ్లో పశువులకు గడ్డివాములు వేస్తూ ఒక్కసారిగా కళ్లు తిరిగి కిందపడిపోయాడు. అక్కడే ఉన్న కుటుంబ సభ్యులు ఆయన్ను పాల్తూరు గ్రామంలోని పీహెచ్‌సీకు తరలించగా అక్కడ పరీక్షించిన వైద్యులు వెంటనే ఉరవకొండ ఆసుపత్రికి తీసుకెళ్లాలని సూచించారు. దీంతో శంకరప్పను ద్విచక్రవాహనంలో ఉరవకొండ ప్రభుత్వాసుపత్రికు తీసుకురాగా పరీక్షించిన వైద్యులు అతను మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతునికి భార్య లక్ష్మి, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కాగా మృతుని బంధువులు పలువురు మాట్లాడుతూ పాల్తూరు పీహెచ్‌సీలో సరైన వైద్య సదుపాయం లేకనే ఉరవకొండకు రావాల్సి వచ్చిందని అక్కడి నుంచి ఇక్కడికి రావడానికి ఆలస్యం కావడంతోనే అతను మృతి చెందాడని ఆరోపించారు.

## ఘనంగా శ్రీసాయినాథుని పల్లకిసేవ

యల్లనూరు, ఫిబ్రవరి 13 ప్రభాతవార్త



శ్రీషిరిడిసాయిబాబాకు పూజలు నిర్వహించిన దృశ్యం

మండల కేంద్రంలోని కస్తూరిబా గురుకుల పాఠశాల ఎదురుగా నూతనంగా నిర్మించిన శ్రీషిరిడిసాయిబాబా ఆలయంలో గురువారం శ్రీసాయినాథుని పల్లకిసేవను ఘనంగా నిర్వహించారు. మాఘమాసం పురస్కరించుకుని ఉదయం బాబాకు పంచామృతాభిషేకాలు, అర్చనలు తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. మధ్యాహ్నాహారతి, కాకడాహారతి తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు ఆలయానికి చేరుకుని బాబాను దర్శించుకుని పూజలు చేశారు. సాయంత్రం పల్లకి సేవను ఘనంగా నిర్వహించారు. హాజరైన భక్తులకు ఆలయ నిర్వాహకులు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

## వైభవంగా భగళాముఖి అమ్మవారి రథోత్సవం

-వివిధ గ్రామాల నుండి పెద్ద సంఖ్యలో పాల్గొన్న భక్తజనం

-నేటి తెల్లవారుజామున గురుసిద్ధావదూతల వారి రథోత్సవం



భగళాముఖి అమ్మవారి రథం లాగుతున్న భక్తులు

ఉరవకొండ, ఫిబ్రవరి 13 ప్రభాతవార్త



అమ్మవారి మూలవిరాట్‌కు ప్రత్యేక పూజలు నిర్వహించిన దృశ్యం

మండల పరిధిలోని వెలిగొండ గ్రామంలో వెలిసిన భగళాముఖి అమ్మవారి రథోత్సవం స్వస్తిశ్రీ క్రోధినామ సంవత్సరం మాఘమాస బహుళ పాడ్యమి గురువారం సాయంత్రం అంగరంగ వైభవంగా జరిగింది. సాయంత్రం గురుసిద్దేశ్వర స్వామి మఠం నుండి గురులింగప్ప స్వామి, గ్రామ ప్రజలు, భక్తులు భగళాముఖి అమ్మవారి ఆలయానికి వెళ్లి జెండా ప్రతిష్టాపన గావించారు. అనంతరం భగళాముఖి అమ్మవారి పూజకార్యక్రమం నిర్వహించి సాయంత్రం అమ్మవారి ఉత్సవమూర్తిని మేళతాళాలు, మంగళవాయిద్యాల నడుమ రథంలో కొలువుదీర్చి రథాంగ పూజలు న్విహించిన అనంతరం భగళమ్మ పాహిమాం అంటూ భక్తులు రథాన్ని లాగారు. రథోత్సవం సందర్భంగా ఉదయం నుండి అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు కొనసాగాయి. రథోత్సవంలో గ్రామానికి చెందిన వారే కాకుండా చుట్టు ప్రక్కల గ్రామాల భక్తులు సైతం పెద్దఎత్తున పాల్గొనడం కనిపించింది. కాగా రాత్రి గురు సిద్దేశ్వరస్వామి రథోత్సవంలో భాగంగా భక్తులందరూ కలిసి ఉచ్ఛాయం ఎత్తిన అనంతరం భక్తులకు అన్నదానం నిర్వహించారు. నంది కోలాటములతో గంగనీటి ఊరేగింపు, ఆలూరు గురుసిద్దేశ్వరసా ్వములవారి జీవ సమాధి నుండి తెచ్చిన తీర్థమును తీసుకొచ్చిన అనంతరం శుక్రవారం తెల్లవారుజామున గురుసిద్ధావదూతల వారి రథోత్సవం, పీఠాధిపతి ఆధ్వర్యంలో భవిష్యత్తును తెలిపే కార్ణీకం చెప్పబడనుంది. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా ఎస్‌ఐ పి.జనార్ధనానాయుడు సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు.

## తాసిల్దార్ నీలకంఠారెడ్డికి తీర్వ గాయాలు

- అనంతపురం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న తాసిల్దార్ నీలకంఠ రెడ్డి



రెండు కార్లు ఎదురెదురుగా ఢీకొన్న దృశ్యం.

కొత్తచెరువు ఫిబ్రవరి 13 ప్రభాతవార్త

మండల పరిధిలోని కోడపగానిపల్లి గ్రామం లో గురువారం ఉద యం 10:30 గంటల సమయంలో రెండు కార్లు ఎదురెదురుగా ఢీ కొన్న సంఘటనలో కొత్తచెరువు తహసిల్దార్ నీలకంఠారెడ్డి కి తీవ్ర గాయాలు అయిన సంఘటన చోటు చేసుకుంది స్థానికులు పోలీసులు తెలిపి న వివరాలు మేరకు అనంతపురం నుంచి కొత్తచెరువు వైపు వస్తుండగా తాసిల్దార్ నీలకంఠారెడ్డి అలాగే కొత్తచెరువు వైపు నుంచి ధర్మవరం వైపు డిప్యూటీ తాసిల్దార్ సురేష్ వెళుతుండగా మార్గం మధ్యలో రెండు కార్లు ఢీకొన్న సంఘటనలో తాసిల్దార్ నీలకంటారెడ్డి కి ముఖం మీద తలకు తీర్వా గాయాలు కావడంతో హుటాహుటిన 108 లో సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ కి తరలించి చికిత్స చేయడం జరిగింది. ధర్మవరం డిప్యూటీ తాసిల్దార్ సురేష్ కి స్వల్ప గాయాలు కావడంతో స్థానిక ప్రభుత్వాసుపత్రిలో చికిత్స చేయించుకున్నారు.

## భక్తిశ్రద్ధలతో సేవాలాల్ మహారాజ్ ఇరుముడి కార్యక్రమం

-సేవాగడ్‌కు బయలుదేరిన మాలదారులు



ఇరుముడి కార్యక్రమం జరుగుతున్న దృశ్యం

ఉరవకొండ, ఫిబ్రవరి 13 ప్రభాతవార్త

వజ్రకరూరు మండలంలోని రూపానాయక్ తండా గ్రామంలో గురువారం బంజారాల ఆరాధ్య దైవం సద్గురు సేవాలాల్ మహారాజ్ ఇరుముడి కార్యక్రమం భక్తిశ్రద్ధల నడుమ కొనసాగింది. స్థానిక గురునానక్, సామాసంగ్ మహారాజ్ ఆలయాల్లో జరిగిన కార్యక్రమంలో మాలదారులు ప్రత్యేక పూజల అనంతరం ఇరుముడి ధరించి గుత్తి మండలంలోని సేవాగ డ్‌కు తరలివెళ్లారు. ఈ సందర్భంగా బంజారాల సాంప్రదాయ రీతిలో నగరా



ఇరుముడితో సేవాగడ్‌కు బయలుదేరిన మాలదారులు

మ్రోగించి డాల్ తల్వార్ తిప్పుతూ వారిని ఘనంగా సాగనంపారు. ఈ సందర్భంగా భక్తులకు అన్నదాన కార్యక్రమం జరిగింది. దేశంలోని 15 కోట్ల మంది బంజారాల ఆరాధ్య దైవమైన సద్గురు సేవాలాల్ మహారాజ్ జయంతి ఫిబ్రవరి 15వ తేదీను ప్రభుత్వం జాతీయ సెలవు దినంగా ప్రకటించాలని పలువురు బంజారాలు కోరారు. ఈ కార్యక్రమంలో వజ్రకరూరు పశు వైద్యులు డాక్టర్ వి.రాంమ్మూర్తి నాయక్, బంజారా సంఘం ప్రతినిధులు ఎస్.కె.దాసునాయక్, బంజారా గిరిజన సమాఖ్య ఉద్యోగుల సంఘం అధ్యక్షులు ఎస్.సామానాయక్, నాయకులు నంగరేర్ నాయక్, డావో ఉమాపతి నాయక్, కార్బరి ఉదానాయక్, నంగార్జీ కె.సోమ్లా నాయక్, ఏరియా కె.టాక్రియా నాయక్, రమావత్ దేవుల నాయక్, రమావత్ లక్కనాయక్, ఎస్.ఎర్రిస్వామి నాయక్, ఆర్.తొలిచానాయక్, నాగరాజు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

05ATP13_05ATP13.qxd 13-02-2025 PM 11:47 Page 1



## రోడ్డు భద్రతపై విద్యార్థులకు అవగాహన



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఆర్టీఓ శ్రీనివాసులు



పాల్గొన్న విద్యార్థులు

**తాడిపత్రిటౌన్, ఫిబ్రవరి 13 ప్రభాతవార్త**

తాడిపత్రి పట్టణ శివారులోని ఆటోనగర్ వద్ద వున్న ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలోని విద్యార్థులకు రోడ్డు భద్రత మాసోత్సవాల్లో భాగంగా తాడిపత్రి మోటర్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు రోడ్డు భద్రతపై గురువారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ద్విచక్రవాహనం నడిపేటప్పుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. త్రిబుల్‌రైడింగ్ మంచిదికాదన్నారు. వాహనం నడిపే సమయంలో తప్పనిసరిగా డ్రైవింగ్ లైసెన్స్ కలిగి వుండాలన్నారు. వాహనాలు నడిపే సమయంలో ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రత నియమాలు తప్పకుండా పాటించాలని ఆయన విద్యార్థులకు తెలియచేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు, రవాణశాఖ కార్యాలయం సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## పలువురు సిపిఐలో చేరిక



సిపిఐలో చేరిన దృశ్యం

**తాడిపత్రిటౌన్, ఫిబ్రవరి 13 ప్రభాతవార్త**

పట్టణంలోని పలువురు నాయిబ్రాహ్మణులు, కార్మికులు గురువారం సిపిఐలో చేరారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యదర్శివర్గసభ్యులు, తాడిపత్రి నియోజకవర్గం ఇన్‌చార్జ్ జె.రాజారెడ్డి వారికి కండువాలు వేసి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ పట్టణ కార్యదర్శి చిరంజీవియాదవ్, సహాయ కార్యదర్శులు శ్రీరాములు, రామాంజి, నాయకులు నాగేంద్ర, రమణయ్య, అబ్రహం, నాగార్జున, శివ, నరేష్, రమణయ్య, ఎం.రంగనాథ్, ఎం.గోవర్ధన్, తదితరులు పాల్గొన్నారు.

## 8వ వార్డులో అర్జీల కార్యక్రమం



అర్జీల కార్యక్రమంలో పాల్గొన్న రాజారెడ్డి

**తాడిపత్రిటౌన్, ఫిబ్రవరి 13 ప్రభాతవార్త**

తాడిపత్రి పట్టణంలోని 8వవార్డులో ఇళ్లు లేని నిరుపేదలకు గుర్తించి వారికి అర్జీలు వ్రాసే కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. సిపిఐ పట్టణ కార్యదర్శి చిరంజీవియాదవ్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సిపిఐ తాడిపత్రి ఇన్‌చార్జ్, జిల్లా కార్యదర్శివర్గసభ్యులు రాజారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా రాజారెడ్డి మాట్లాడుతూ తాడిపత్రి ప్రాంతంలో ఇళ్లు లేని నిరుపేదలు చాలా మంది వున్నారని వారి కోసం సిపిఐ పార్టీ ఒక ఉద్యమాన్ని చేపట్టిందన్నారు. గత వైసిపి ప్రభుత్వంలో పట్టణాల్లో ఒక సెంటు, గ్రామాల్లో ఒకటిన్నర సెంటు చొప్పున ఇంటి పట్టా ఇవ్వడం జరిగిందని అయినా ఎక్కడ సంపూర్ణంగా ఇళ్ల నిర్మాణం గత ప్రభుత్వం చేపట్టలేదన్నారు. చంద్రబాబునాయుడు అధికారంలోకి వస్తే పట్టణాల్లో రెండు సెంట్లు, గ్రామాల్లో మూడు సెంట్ల చొప్పున స్థలం ఇచ్చి ఇంటి నిర్మాణానికి 4 లక్షల రూపాయలు ఇస్తామని హామీ ఇవ్వడం జరిగిందని ఇచ్చిన హామీ మేరకు కూటమి ప్రభుత్వం పట్టణాల్లో రెండు సెంట్లు, గ్రామాల్లో మూడు సెంట్ల చొప్పున స్థలం కేటాయించడంతో పాటు 5 లక్షల రూపాయలు మంజూరు చేసి ఇసుక, ఇటుక, కడ్డీలు, కంకర ఉచితంగా అందచేయాలని ఆయన డిమాండ్ చేశారు. జగనన్న ప్రభుత్వంలో ఇచ్చిన పట్టాలు రెడ్ మార్కులో చూపిస్తున్నాయని కావునా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి రెడ్ మార్కులు తొలగించి లబ్దిదారులకు అందరికి న్యాయం చేయాలని ఆయన తెలియచేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ పట్టణ సహాయ కార్యదర్శులు శ్రీరాములు, రామాంజి, నాయకులు నాగేంద్ర, శివ, నరేష్, ఎం.రఘునాథ్, ఎం.గోవర్ధన్ పాల్గొన్నారు.

## స్కేటింగ్‌లో ప్రతిభ చాటిన శ్రీచైతన్య విద్యార్థులు



విద్యార్థులను అభినందిస్తున్న ఏజిఎం సుబ్బారెడ్డి

**అనంతపురం న్యూటౌన్, ఫిబ్రవరి 13 ప్రభాతవార్త**

హౌసింగ్ బోర్డులో ఉన్న శ్రీ చైతన్య స్కూల్ ఏటిపి 8లో చదువుతున్న విద్యార్థులు 3వ తరగతి లెహత్‌కుమార్, 6వ తరగతి హనీష్, పూణేలో జరిగిన నేషనల్ లెవెల్ స్కేటింగ్ కాంపిటీషన్‌లో విజయం సాధించారు. విద్యార్థులను ఏజిఎం సుబ్బారెడ్డి అభినందించారు. ఇంకా ఎన్నో సాధించాలని వారిని ప్రోత్సహించారు. ప్రిన్సిపాల్ నేత్రావతి, కోఆర్డినేటర్ నాగభూషణం, డీన్ అరుణ్, కిరణ్, ప్రైమరీ కోఆర్డినేటర్ పూజ, ప్రీ ప్రైమరీ కోఆర్డినేటర్ సబిత పిఈటి శివ ప్రకాష్, సుహాసిని, ఇన్‌చార్జ్‌లు దైవ కృప అర్షియా రషీదా, ఉపాధ్యాయ బృందం విద్యార్థులు వారి ప్రతిభను అభినందించారు. వారికి ప్రిన్సిపాల్ నేత్రావతి ప్రత్యేక అభినందనలు తెలిపారు.

## పేకాటరాయుళ్లు అరెస్ట్

**ముదిగుబ్బ, ఫిబ్రవరి 13 ప్రభాతవార్త**

మండల కేంద్రంలోని శ్రీకాశిరెడ్డినాయన ఆశ్రమం వెనుక పేకాటాడుతున్న 5 మందిని ముదిగుబ్బ అర్బన్ సిఐ శివరాముడు గురువారం అరెస్ట్ చేశారు. అందిన సమాచారం మేరకు సిబ్బందితో కలిసి పేకాట స్థావరంపై దాడి చేసి పేకాటాడుతున్న 5 మందిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుండి 5,650 రూపాయల నగదు, 5 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకుని వారిపై కేసు నమోదు చేసినట్లు సిఐ తెలిపారు.

## బంజారాల ఆరాధ్య దైవం శ్రీ సేవాలాల్ మహారాజ్ 286 జయంతి

### తనకల్లు ఎస్సీ,ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ బి.రాంప్రసాద్‌నాయక్, గంగులయ్య



సమావేశంలో మాట్లాడుతున్న గంగులయ్య, రాంప్రసాద్‌నాయక్

**తనకల్లు, ఫిబ్రవరి 13 ప్రభాతవార్త**

బంజారాల ఆరాధ్య దైవం శ్రీ సేవాలాల్ మహారాజ్ 286జయంతిని బంజారాలు ఘనంగా జరుపుకోవాలని ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటి బి.రాంప్రసాద్‌నాయక్ మరియు గంగులయ్యలు పేర్కొన్నారు. ఈ సందర్భంగా గురువారం వారు విలేఖర్లతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలకు 286జయంతి సదర్భంగా శుబాకాంక్షలు తెలిపారు. అందులో బాగంగా ఈ సంవత్సరం 2025లో 286జయంతిని శనివారం ఘనంగా జపుకోవాలని రాష్ట్ర వ్యాప్తంగా తండాల్లో భోగ్ పూజ శ్రీ సేవాలాల్ మహారాజ్ దేవుడి భక్తి పూజలు చేసి నైవేద్యం చేసి సాంస్కృతి ఆచారాలు భక్తి సేవాలాతో ఆయన అడుగుజాడల్లో నడిచి ఈ జయంతిని మహోత్సవం వేడుకలు ఉత్సాహంగా 15వ తేదీన జయంతిని జరుపుకోవాలని సూచించారు. ప్రత్యేకించి తనకల్లు మండలంలో గిరిజనులు ఎక్కువగా ఉన్నారని ఆయన తెలిపారు.

## అయ్యా.. మీరే నాకు న్యాయం చేయాలి



డిప్యూటీతాసిల్దార్‌కి వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

**కళ్యాణదుర్గం రూరల్ జనవరి 13 ప్రభాతవార్త**

కళ్యాణదుర్గం మండలం బోరంపల్లి గ్రామంలో రైతు ధనుంజయరెడ్డి కి జరిగిన అన్యాయం పై గురువారం స్థానిక రెవెన్యూ అధికారులను కలిసిన వైఎస్సార్సీపీ నాయకులు.. జెడ్పీటీసీ గుద్దిల్ల నాగరాజు, మండల కన్వీనర్ గోళ్ళ సూరి, పట్టణ కన్వీనర్ ఐ.సుధీర్, పార్టీ జిల్లా కోఆర్డినేటర్ కృష్ణమూర్తి, వాలంటరీల విభాగం ఇంచార్జీ షేక్షా, కిరీటీయాదవ్, నాయకులు సోమశేఖర్రెడ్డి, బయన్న, రవి ,పలువురు రైతులు వెంకటేసులు, ఉదయ్, జగదీశ్ తదితరులు రీసర్వే డిప్యూటి తహశీల్దార్ శ్రీరాములు, వీఆర్వోజవహర్బాష లను కలిసి వాల్టా చట్టాన్ని సక్రమంగా అమలుచేయాలని డిమాండ్చేశారు.(బాధిత రైతు దనుంజయరెడ్డి) గత కొన్ని నెలలుగా.తన వ్యవసాయ బోరుకు దగ్గరగా అదే గ్రామానికి చెందిన సతీష్ అనుమతి లేకుండా బోర్ రాత్రికి రాత్రే వేయించారని దాంతో బాధితునీకి అన్యాయం జరుగుతుందని ఫిర్యాదు చేసిన అధికారులు చర్యలు ఎందుకు తీసుకోలేదని ప్రశ్నించారు. "సర్వే నంబర్ 81 లో 5 ఏకారులు పొలం ఉంటే 2012 లో రెవెన్యూ, విద్యుత్ అధికారుల అనుమతి సర్వీస్ నంబర్లు 749,750" తీసుకొని తోట చేస్తున్నారని ఆధారాలు అధికారులకు సమర్పించారు.అక్రమంగా వేసిన బోర్ను సీజ్ చేయకుండా టిడిపి నాయకుల ఒత్తిళ్లకు తలొగ్గి తే న్యాయపోరాటం చేయాల్సి వస్తుందన్నారు".అదేవిధంగా ఉదయ్ అనేరైతు తన పొలం మునిగిపోతుందని ఒక చిన్న కట్ట వద్ద కొంత ట్రెంచ్ వేస్తే అధికారపార్టి పెద్దల ఒత్తిళ్లతో హడావుడి చేస్తున్నారని ఇది మంచిది కాదన్నారు . పైగా సదరు రైతు కబ్జా చేశాడని ఆరోపించడం హాస్యాస్పదం అన్నారు .అధికారులంటే మాకు గౌరవం ఉందని అధికారపార్టీ ఒత్తిళ్లకు తలొగ్గి ఇబ్బందులు పడవద్దని హితవుపలికారు.

## జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోండి



గోపాల్‌రెడ్డి

**అమడగూరు, ఫిబ్రవరి 13 ప్రభాతవార్త**

ఈ నెల 16వతేదీ ఆదివారం పుట్టపర్తిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించనున్న జాబ్‌మేళాను అమడగూరు మండలంలోని నిరుద్యోగ యువతీ యువకులు సద్వినియోగం చేసుకోవాలని మండల టిడిపి కన్వీనర్ గోపాల్‌రెడ్డి తెలియచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి ఆహ్వానం మేరకు 50కిపైగా కంపెనీల ఆధ్వర్యంలో పెద్దఎత్తున జాబ్‌మేళా నిర్వహించడం జరుగుతుందన్నారు. నియోజకవర్గంలోని నిరుద్యోగ యువతీ యువకులకు ఉద్యోగాల కల్పనే ధ్యేయంగా ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డిలు ప్రత్యేక చొరవతో ఈ జాబ్‌మేళా నిర్వహించడం జరుగుతోందన్నారు. జాబ్‌మేళాకు హాజరయ్యే వారికి భోజన సౌకర్యం కల్పించనున్నారు. ఈ అవకాశాన్ని మండలంలోని నిరుద్యోగ యువతీ యువకులు సద్వినియోగంచేసుకోవాలన్నారు. అలాగే ఈ నెల 15న ఓడిచెరువులో ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డిల ఆధ్వర్యంలో నిర్వహించనున్న ప్రజాసమస్యల పరిష్కార వేదికలో అమడగూరు మండలానికి చెందిన ప్రజలు తమ సమస్యలను విన్నవించుకోవచ్చని ఆయన తెలియచేశారు.

## నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

**పుట్లూరు, ఫిబ్రవరి 13 ప్రభాతవార్త**

మండలంలోని ఏ.కొండాపురం సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని ట్రాన్స్‌కో ఎఇ విజయుడు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏ.కొండాపురం సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాలకు ఉదయం 8 నుండి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఇందుకు వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

## వైసిపి నుండి బిజెపిలోకి చేరికలు

**కూడేరు, ఫిబ్రవరి 13 ప్రభాతవార్త**

ఉదిరిపికొండ గ్రామానికి చెందిన వైఎస్ఆర్‌సిపి యువజన నాయకులు, ఎమ్మార్పిఎస్ నాయకులు మీనుగ ఎరిస్వామి (అలియాజ్ ధోని) బిజెపి జిల్లా అధ్యక్షులు కొనకొండ్ల రాజేష్ ఆధ్వర్యంలో బిజెపి పార్టీలోకి చేరడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. భారత ప్రధానమంత్రి నరేంద్రమోదీ పరిపాలన విధానం నచ్చి, ప్రజలకు చేస్తున్న సంక్షేమ పథకాలు నచ్చి బిజెపి పార్టీలో చేరడం జరిగిందని అన్నారు. అలాగే బిజెపి జిల్లా అధ్యక్షులు మాట తీరు, అందరిని కలుపుకొని పోయే మంచి తనం కార్యకర్తలకు భరోసా ఇచ్చే విధానం నచ్చి పార్టీలోకి చేరడం జరిగిందని వారు విలేకరులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా ఎస్సీ మోర్చ నాయకులు శివ పాల్గొన్నారు.

## రైతు సేవా కేంద్రం సిబ్బందికి శిక్షణా కార్యక్రమం

**పుట్లూరు, ఫిబ్రవరి 13 ప్రభాతవార్త**

పుట్లూరు మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయంలో గురువారం ఏడిఏ చెంగలరాయుడు, తహశీల్దార్ శేషారెడ్డిల ఆధ్వర్యంలో విఏఏ, విహెచ్‌ఏలకు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడిఏ మాట్లాడుతూ వ్యవసాయ భూములు వున్న ప్రతి రైతుకు ఫార్మర్ రిజిస్ట్రేషన్ ఐడి త్వరగా చేయాలన్నారు. అలాగే కంది కొనుగోలుకు సంబంధించి ఖరీఫ్‌లో కందిసాగు చేసిన రైతులకు రిజిస్ట్రేషన్ చేయాలని సూచించారు. అనంతరం తహశీల్దార్ మాట్లాడుతూ రబీ పంట నమోదు చేసిన ప్రతి ఒక్క రైతుకు తప్పకుండా ఈకెవైసి చేయాలని, వంద శాతం పూర్తి చేయాలని ఆదేశించారు. మండల వ్యవసాయాధికారి కాత్యాయిని మాట్లాడుతూ పంటకోత ప్రయోగాలు నిర్వహించి గ్రామాల నుండి ఫారం-2, సూపర్‌విజన్ ఫారం త్వరగా ఇవ్వాలని ఏఇ సూచిం చారు. ఈ కార్యక్రమంలో ఏడిఏ చెంగలరాయుడు, తహశీల్దార్ శేషారెడ్డి, మండల వ్యవసాయాధికారి కాత్యాయిని, ఏఎస్ఐ విజయ్‌కుమార్, ఆత్మా బిటిఎం చంద్ర, శేఖర్ రెడ్డి, ఏఇఒ హరి, రైతు సేవా కేంద్రం సిబ్బంది, ఆర్ఎస్‌కె సిబ్బంది పాల్గొన్నారు.

## లీగల్ సెల్ మండల సర్వీస్ సమావేశం



గ్రామ లీగల్ సర్వీస్ కమిటీ అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న మండల అధికారుల

**నల్లచెరువు ఫిబ్రవరి 13. ప్రభాతవార్త**

నల్లచెరువు మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రమునందు లీగల్ సెల్ మండల్ సర్వీసెస్ సమావేశం మండల వైద్యాధికారి డాక్టర్ కల్పనా రెడ్డి ఆధ్వర్యంలో సమావేశంలో నిర్వహించి అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా. మండల వైద్యాధికారి మాట్లాడుతూ గ్రామములో గ్రామ లీగల్ సర్వీసెస్ కమిటీ అనగా ఏఎన్ఎం, ఆశ, అంగన్వాడిలు, ప్రతి ఇంటింటి సర్వే చేయాలి సర్వే చేసి అప్పుడే పుట్టిన శిశువులకు ఏవైనా లోపాలు, సదరం క్యాంపుల గురించి అవగాహన కల్పిస్తూ బాల్యవివాహాలు పై కౌన్సెలింగ్ నిర్వహించాలని, పేషంట్లను గ్రామ కమిటీ గుర్తుపడితే, వైద్యాధికారికి తెలియ జేయాలని స్క్రీనింగ్ నిర్వహిస్తామని తెలిపారు, మండల తాసిల్దార్. రవికుమార్ మాట్లాడుతూ ఈనెల 24వ తేదీ వరకు గ్రామంలో ఏఎన్ఎం అంగన్వాడి ఆశా కార్యకర్తలు ఇంటింటి సర్వే చేసి 24వ తేదీన ఏదైనా కేసులు గుర్తించినచో వారి వివరాలను తెలియజేయాలని తెలిపారు ఎంపీడీవో గుప్తా ఆరోగ్య సిబ్బంది ప్రతి గ్రామంలోనూ ఇంటింట సర్వేలో భాగంగా మీరందరూ అన్ని కార్యక్రమాలపై అవగాహన కల్పించాలని అందరూ కలిసిమెలసి సర్వే పకడ్బందీగా నిర్వహించాలని కొనియాడారు. సిహెచ్ఓ రామచంద్రారెడ్డి గ్రామ కమిటీ అయినా ఏఎన్ఎం ఆశ అంగన్వాడి ఒక రిజిస్టర్ను ఏర్పాటు చేసుకోవాలని అందులో సర్వేలో భాగంగా అనుమానుతులైన వారి వివరాలను రికార్డులో నమోదు చేసి వైద్యాధికారికి కానీ తాసిల్దారు కు ఎంపీడీవోకు తెలియజేసి సర్వే సక్రమ ంగా చేయాలని పై సర్వే అంతా ఈనెల 24వ తేదీన సర్వేలు రిపోర్టులను జడ్జి గారికి అందజేయాల్సి ఉంటుందని తెలిపారు ఈ కార్యక్రమంలో సిహెచ్ఓ రామచంద్రారెడ్డి. ఏవో రామకృష్ణ, సూపర్వైజర్ సుధాకర్. సచివాలయ ఏఎన్ఎమ్స్. హెల్త్ అసిస్టెంట్లు. అంగన్వాడి కార్యకర్తలు, ఆశ కార్యకర్తలు, పాల్గొన్నారు

## ముందు అనుమతి పొందిన తరువాతే ప్లాట్లు వేయాలి



రాళ్లను తొలగిస్తున్న అధికారులు

**నంబులపూలకుంట, ఫిబ్రవరి 13 ప్రభాతవార్త**

ఎంపిడిఓ ఎంఆర్ఓ కార్యాలయాల పక్కన సర్వే నెంబర్ 275, 276, 277, 278, 561, 562, 563 నెంబర్స్‌ను అక్రమంగా ప్లాట్లు వేస్తున్న ప్లాట్ రాళ్లను ఎంపిడిఓ, డియల్‌డిఓ డి.అంజినప్ప, ఈఓఆర్డి ఆధ్వర్యంలో ప్లాట్ రాళ్లను తొలగించి ఆథరైజ్డ్‌గా పర్మిషన్ పొందిన తరువాత ప్లాట్స్ వేయాలని తెలిపారు. జిఓ నెంబర్ 5 ప్రకారం అహుడా వద్ద నుంచి అనుమతి పొందాలని తెలిపారు. ప్రభుత్వ నిబంధనల మేరకు అనుమతి పొందిన తరువాతనే ప్లాట్స్ వేసి క్రయ విక్రయాలు చేయాలని తెలిపారు. ఈ సర్వే నెంబర్లలో రిజిస్ట్రేషన్ చేయకూడదని సబ్ రిజిస్టర్ కదిరి వారికి లేఖ కూడా పంపడమైందని తెలిపారు.

## మహాధర్నాను జయప్రదం చేయండి

### - సిపిఐ జిల్లా కార్యదర్శి వేమ యాదవ్




అర్హత పత్రాలు నమోదు కార్యక్రమంలో పాల్గొన్న సిపిఐ జిల్లా కార్యదర్శి వేమ యాదవ్

**కదిరి, ఫిబ్రవరి 13 ప్రభాతవార్త**

అర్హులైన నిరుపేదలకు గ్రామీణ ప్రాంతాల్లో 3 సెంట్లు, పట్టణ ప్రాంతాల్లో 2 సెంట్లు నివేశ స్థలాలు కేటాయించాలని, సిపిఐ ఆధ్వర్యంలో మార్చి 3న కలెక్టర్ కార్యాలయం వద్ద జరిగే మహాధర్నాను జయప్రదం చేయాలని సిపిఐ జిల్లా కార్యదర్శి వేమ యాదవ్ పిలుపునిచ్చారు. గురువారం భారత కమ్యునిస్టు పార్టీ ఆధ్వర్యంలోపట్టణంలోని గజ్జలరెడ్డిపల్లిలో కాలనీ వాసులతో అర్హత పత్రాల నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సిపిఐ జిల్లా కార్యదర్శి వేమ యాదవ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సంరధ్భంగా ఆయన మ ఆట్లాడుతూ. .ఎనికనకల ముందు ప్రభుత్వం ఇచ్చినటువంటి మామీ ఏదైతో ఉందో దానిని తుంగలో తొక్కే ప్రయత్నం చేస్తోందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో 3 సెంట్లు, పట్టణ ప్రాంతాల్లో 2 సెంట్ల స్థలాన్ని కచ్చితంగా ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆ దిశగా సిపిఐ ఆధ్వర్యంలో మార్చి 3న కలెక్టర్ కార్యాలయం వద్ద మహాధర్నాను తలపెట్టామని, అర్హులైన నిరుపేదలందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పవన్, లియాఖతలి, మధు, మహేంద్ర, మహేష్, శోభరాణి, భవానిలు పాల్గొన్నారు.

## బిజేపి మండల కన్వీనర్‌గా వీరాంజనేయులు



వీరాంజనేయులు

**ఓబుళదేవరచెరువు, జనవరి 13, ప్రభాతవార్త**

భారతీయ జనతా పార్టీ మండల కన్వీనర్‌గా మండలంలోని గాజుకుంటపల్లికి చెందిన ఇడగుట్ట వీరాంజినేయులును ఎంపిక చేస్తూ రాష్ట్ర పార్టీ గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సందర్బాన్ని పురస్కరించి కన్వీనర్ వీరాంజనేయులు విలేకరులతో మాట్లాడుతూ... మండల పార్టీ కన్వీనర్‌గా తనను రాష్ట్ర కార్యదర్శి నాగోతు రమేష్‌నాయుడు, జిల్లా రిటర్నింగ్ అధికారి రొద్దం ఉత్తమరెడ్డి, జిల్లా సహ రిటర్నింగ్ అధికారి మేడుకుర్తి హరిలు ఎంపిక చేశారన్నారు. వారి నమ్మకాన్ని వొమ్ము చేయకుండా అహర్నిషలు పార్టీ అభివృద్ధికి పని చేస్తానన్నారు. ప్రజా సమస్యలు, స్థానిక సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. తన ఎంపికకు సహకరించిన నాయకులకు ధన్యవాదాలు తెలియజేశారు. నూతన కన్వీనర్ వీరాంజికి బిజేపి నాయకులు రంగారెడ్డి, ఆశ్వర్థప్ప, నాగప్ప, కిష్టప్ప, లక్ష్మినారాయణ, మేకల వెంకటరమణ తో పాటు మిత్రులు శుభాకాంక్షలు తెలియచేశారు.

## 15న ఐటిఐలో ప్రజా గ్రీవెన్స్ హాజరుకానున్న మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి, ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి

**ఓబుళదేవరచెరువు, ఫిబ్రవరి 13, ప్రభాత్తవార్త**

పుట్టపర్తి నియోజవర్గ ప్రజల సమస్యల పరిష్కారం కోసం తెలుగుదేశం పార్టీ ఆదేశాల మేరకు ఈనెల 15న(శనివారం) మండల కేంద్రంలోని ఐటిఐ కేంద్రంలో మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి గారు,శ్రీమతి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి గారి ఆధ్వర్యంలో ప్రజా గ్రీవెన్స్ ను ఏర్పాటు చేసినట్లు ఎమ్మెల్యే గారి పిఆర్ఓ సంతోష్ రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ముఖ్యంగా ఓడి చెరువు మండలం తో పాటు ఆమడగూరు, నల్లమాడ మండలాలకు సంబంధించిన ప్రజలు ,కూటమి పార్టీల కుటుంబ సభ్యులు ఈ ప్రజా గ్రీవెన్స్ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. గ్రీవెన్స్ కార్యక్రమానికి ఆయా మండలాల స్థానిక ప్రజా ప్రతినిధులతో పాటు ప్రభుత్వ అధికారులు కూటమి పార్టీ కుటుంబ సభ్యులు తదితరులు హాజరై ప్రజల సమస్యలను విన్నవించి సమస్యలను పరిష్కరించుకోవాలని కోరారు. గ్రీవెన్స్ కు హాజరయ్యే ప్రజలకు ,ప్రజా ప్రతినిధులకు ,అధికారులకు మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి గారి ఆదేశాల మేరకు భోజన సౌకర్యాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

## క్రమబద్ధీకరణ పథకం 2025 క్రింద తొలి దరఖాస్తు

### క్షేత్రస్థాయిలో దరఖాస్తుదారురాలి ఇంటిని నేరుగా వెళ్లి పరిశీలించిన జిల్లా కలెక్టర్



ప్రజలతో సమస్యలు అడిగి తెలుసుకుంటున్న కలెక్టర్

**అనంతపురం రూరల్ , ఫిబ్రవరి 13 ప్రభాతవార్త**

ప్రభుత్వ నిబంధనల మేరకు క్రమబద్ధీకరణ పథకం కింద ఇంటి పట్టా మంజూరుకు అవసరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి, ఐ.ఏ.ఎస్ పేర్కొన్నారు. అనంతపురం రూరల్ పరిధిలోని కక్కలపల్లి గ్రామంలో క్రమబద్ధీకరణ పథకం 2025 క్రింద దరఖాస్తు చేసుకున్న మేకల మేరి లబ్ధిదారురాలి ఇంటికి వెళ్లి నేరుగా పరిశీలించి జిల్లా కలెక్టర్ వారి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సదురు లబ్ధిదారురాలితో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ ఉత్తర్వు నంబరు 30, తేదీ: 29.01.2025 న ప్రభుత్వం జారీ చేసిన క్రమబద్ధీకరణ పథకం 2025 (రెగ్యులరైజేషన్ స్కీం 2025) కింద ఆక్షేపణ లేని ప్రభుత్వ భూముల్లో ఆక్రమించుకుని ఇల్లు కట్టుకున్న వారు ఎవరైనా ఇంటి పట్టా కోసం దరఖాస్తు చేసుకుంటే క్రమబద్ధీకరించి సంబంధించిన దరఖాస్తుదారుడికి ఇంటి పట్టాను మంజూరు చేయాలని ఆదేశాలు జారీ చేసిందన్నారు.ఈ పథకం కింద దారిద్ర రేఖకు దిగువన ఉండి 150 చదరపు గజాలు (స్క్వేర్ యార్డ్స్) లోపు ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించుకుని ఇల్లు కట్టుకున్న వారికి ఉచితంగా క్రమబద్ధీకరణ చేసి ఇంటి పట్టా మంజూరు చేస్తుందన్నారు. ఈ పథకం కింద సదరు లబ్ధిదారుని వార్షిక ఆదాయం 1,20,000 రూపాయలు మించకుండా ఉంటే ప్రభుత్వం ఉచితంగా క్రమబద్ధీకరణ చేయడం జరుగుతుందన్నారు. ఆ జీవో మేరకు జిల్లాలో అనంతపురం రూరల్ పరిధిలోని కక్కలపల్లి గ్రామానికి చెందిన మేకల మేరి అనే లబ్ధిదారురాలు క్రమబద్ధీకరణ పథకం 2025 కింద తొలి దరఖాస్తు చేసుకుంది. గురువారం సాయంత్రం క్షేత్రస్థాయిలో జిల్లా కలెక్టర్ లబ్ధిదారురాలి ఇంటి వద్దకు ప్రత్యక్షంగా వెళ్లి పరిశీలన చేశారు. సంబంధిత లబ్ధిదారురాలు 72.6 చదరపు గజాలలో నిర్మించుకున్నట్లు లబ్ధిదారురాలు జిల్లా కలెక్టర్ కు తెలిపింది. తాను, తన కోడలు, తమ కుటుంబ సభ్యులు సుమారు 3 లక్షల 60 వేల రూపాయలు అప్పుగా తీసుకుని గృహాన్ని నిర్మించుకున్నట్లు తెలిపింది. ఈ పరిశీలనలో వారి కుటుంబ వార్షిక ఆదాయ వివరాలను, కుటుంబ సభ్యుల వివరాలను జిల్లా కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. లబ్ధిదారురాలి దరఖాస్తును ఫారం2లో పేర్కొన్న వివరాలన్నింటిని జిల్లా కలెక్టర్ అక్కడిక్కడే విఆర్ఓతో నమోదు చేయించారు. ఇక్కడున్న ప్రభుత్వ భూమిలో ఏమైనా కోర్టు కేసులు ఉన్నాయా, జాతీయ రహదారికి దగ్గరలో ఈ భూమి ఉందా, ఏదైనా ప్రాజెక్టులకు ఇక్కడ భూమిని కేటాయించారా, తదితర వివరాలను జిల్లా కలెక్టర్ తహసీల్దార్ ను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా తాము అన్ని విధాలా పరిశీలించడం జరిగిందని, నిబంధనల మేరకే భూమి ఉందని తహసిల్దార్ జిల్లా కలెక్టర్ కు తెలియజేశారు. ఇందులో భాగంగా గ్రామ మ్యాప్ ని జిల్లా కలెక్టర్ పరిశీలించారు. గ్రామంలోని కాలువను సబ్ డివిజన్ చేయాలని, సబ్ డివిజన్ చేసిన తర్వాతనే క్రమబద్ధీకరణ చేయాల్సి ఉంటుందని అధికారులకు జిల్లా కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ కేశవనాయుడు, తహసీల్దార్ మోహన్ కుమార్, విఆర్ఓ, పంచాయతీ సెక్రటరీ హిదయాతుల్లా , మండల అధికారులు సచివాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా పాస్టర్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షునిగా రెండవసారి ఎన్నికైన రెడ్డివారి నెహెమ్యా నాగరాజు

### 56వ సర్వసభ్య సమావేశంలో ఎన్నుకున్న కమిటీ సభ్యులు.



నూతన కమిటీ సభ్యులను సన్మానించిన పాస్టర్లు.



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షులు రెడ్డివారి నెహెమ్యా నాగరాజు

**అనంతపురం రూరల్, ఫిబ్రవరి 13 ప్రభాతవార్త**

అనంత జిల్లా పాస్టర్ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడిగా రెండవసారి కమిటీ సభ్యులు రెడ్డివారి నెహెమ్యా నాగరాజును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతపురం జిల్లా పాస్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 56వ సర్వసభ్య సమావేశము నిర్వహించి అనంతరం అసోసియేషన్ నూతన కమిటీ ఎన్నిక గురువారము అనంత రూరల్ మండలం రాచంపల్లి పంచాయతీలోని యేసు కృపా మందిరంలో అధ్యక్షులు పాస్టర్ రెడ్డి వారి నెహెమ్యా నాగరాజు ఆధ్వర్యంలో దేవుని మహిమకరంగా చేపట్టారు. అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ పాస్టర్. పీ మార్కు అధ్యక్షతన, పాస్టర్ శాంసన్ నాయక్ ప్రార్థించగా దైవ సేవకులు పాటలు పాడి దేవుని నామాన్ని ఘనపరిచారు. అసోసియేషన్ ట్రెజరర్ పాస్టర్.కె జీవన్ బాబు ఆరాధన నిర్వహించారు. ముఖ్య ప్రసంగీకులు రెవరెండ్. బీ షాలేమ్ రాజుమీతో కూడ క్రీస్తునందునిలిచియుండునట్లుగా మమ్మును స్థిరపరచి అభిషేకించినవాడు దేవుడేఅని ముఖ్య అతిథి గౌరవ అధ్యక్షులు రెవ. బందెల రాజు శుభాకాంక్షలు తెలియజేశారు. తదనంతరం గౌరవ అధ్యక్షులు రెవ. బందెల రాజు , గౌరవ సలహాదారులు పాస్టర్ వైఫై బాబు , రెవరెండ్ చెల్లా కిషోర్ , రెవరెండ్ టీ సంపత్ కుమార్ , రెవరెండ్ వీరేష్ ఎలక్షన్ కమిషన్ గా అసోసియేషన్ నూతన కార్యవర్గమును ఏకగ్రీవముగా ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా పాస్టర్ రెడ్డి వారి నెహెమ్యా నాగరాజు , అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ పాస్టర్. పీ మార్కు, సెక్రటరీ పాస్టర్. జి ఆర్ ఆనంద్ , జాయింట్ సెక్రెటరీ పాస్టర్ వి మనషే , ట్రెజరర్ పాస్టర్. కె. జీవన్ బాబు , ఎగ్జిక్యూటివ్ మెంబర్స్ పాస్టర్. జహంగీర్ జాషువా , పాస్టర్ లాబాన్ సుధాకర్, పాస్టర్ విజయ్ సింహ , పాస్టర్ చార్లెస్ నాయక్ గారు నూతన కార్యవర్గముగాఎన్నుకోబడ్డారు. నూతన కార్యవర్గమును సభకు పరిచయము చేసి బొకేతో, శాలువాతో ఆహ్వానం పలికారు.పాస్టర్ శాంసన్ నాయక్ గౌరవ సలహాదారులుగా, పాస్టర్ శాంత వర్ధన్ ప్రార్థన కోఆర్డినేటర్ గా నిర్ణయించారు. అసోసియేషన్ తరపున ముఖ్య ప్రసంగీకులు రెవ.బీ. షాలేమ్ రాజు చేతుల మీదుగా పాస్టర్ రమేష్ కంబదూర్ రూ. 20,000 పాస్టర్ సంతోష్ నాయక్ అనంతపురం రూ.15,000, ముఖ్య అతిథి గౌరవ అధ్యక్షులు రెవ. బందెల రాజు చేతుల మీదుగా పాస్టర్ జి ఆనంద్ షేక్ షాంపల్లి తాండ ఉరవకొండరూ.3000, పాస్టర్ మోషే సింగనమల మండలం రూ.2000 వైద్య సహాయము నిమిత్తము ఆర్థిక సహాయము అందజేశారు. అసోసియేషన్ విచ్చేసిన అతిథులను మూమెంటో, శాలువాతో సత్కరించారు. పాస్టర్ వీరేష్, ప్రార్థన, గౌరవ అధ్యక్షులు రెవ. బందెల రాజు ఆశీర్వాద ప్రార్థనతో కార్యక్రమము ముగించి అనంతరం సభ్యులందరి ప్రేమ విందు అందించారు. ఈ కార్యక్రమంలో పాస్టర్లు దైవ సేవకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

